నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

1

బుధవారం | 08 జనవరి 2025 | www.navatelangana.com

హత్య కేసులో ఓ వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష..

రూ.10 జరిమానా..

నవతెలంగాణ-వట్‌పల్లి

ఏండ్ల నుంచి తప్పించుకుని తిరుగుతున్న హత్యా నిందితునికి సంగారెడ్డి డిస్ట్రిక్ కోర్టు న్యాయమూర్తి భవాని చంద్ర యావజ్జీవ కారాగార శిక్ష.. వేయి రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2013లో ఉమ్మడి అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య అదే గ్రామానికి చెందిన పోచయ్య భార్య చంద్రమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలియడంతో మొటిక పోచయ్య.. సిద్దయ్య, బుడగ జంగాల మొగులయ్య అనే ఇద్దరు వ్యక్తులతో కలిసి చంద్రయ్యను రాళ్లతో కొట్టి చంపారు. ఈ కేసులో అరెస్టు అయిన పోచయ్యకు.. గతేడాదే కఠినకారాగార శిక్షను కోర్టు విధించింది. అలాగే మొగులయ్య పరారీలో ఉండగా..రెండేండ్ల క్రితమే మృతి చెందినట్టు సమాచారం. సిద్దయ్య నాటి నుంచి అజ్ఞాతంలో ఉండగా.. ఆరు నెలల క్రితం వట్‌పల్లి పోలీసులు సిద్దయ్యను ఇస్నాపూర్ చౌరస్తాలో పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా.. వాదనల అనంతరం నిందితునికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు వేయి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-ఝరాసంగం



మొక్కజొన్న పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు. మండ లంలోని క్రిష్టాపూర్‌లో మొక్కజొన్న పంట పొలాలను క్షేత్రస్థా యిలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 30 నుంచి 40 రోజుల వ్యవధిలో పంట ఉందని.. ఈ సమయంలో కాండం తొలు చు పురుగు ఉధృతి నివారణకు క్లోరాంత్రనిలిప్రిల్ 300 ఎంఎల్ 200 లీటర్ నీటికి, కార్బోఫ్యురెన్ గుళికలు ఎకరానికి 3కేజీలు ఆకుల సుడిలో వేయాలన్నారు. పెనుబంక నివార ణకు డిమెత్తోయేట్ ఎకరానికి 200 గ్రాం..200 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ముఖ్యంగా కత్తెర పురుగు నివారణకు ఇది సుడిలోని ఆకులను పూర్తిగా కత్తి రి ంచి వెస్తుందని దీని నివారణకు ఎమామెక్షన్ బీజోట్ 400 గ్రాచొప్పున 200 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాల న్నా రు. ఆయన వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారి, సంపత్, రైతులు సంగమేష్, వీరన్న, హనుమత్, యాదమ్మ పాల్గొన్నారు.

రైతు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మునిపల్లి

జోగిపేటలో నేడు(బుధవారం) జరిగే రైతు నిరసన కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో రైతులు హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ రైతులకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తాము ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.15,000 రైతు బంధు ఇవ్వాలని, తమ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేటి మధ్యాహ్నం 11 గంటలకు జోగిపేట్‌లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాబట్టి అత్యధిక సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయలని.. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్



న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన మాజీ సర్పంచ్ స్వామిదాస్ సోదరి పూలమ్మ ఆనందం దంపతుల నూతన గృహ ప్రవేశ వేడుకకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందం, స్వామిదాస్, సహెూదరీ పూలమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాణి కృప్ప, రాజు, కిరణ్, బాగప్ప, కనకరాజు, దిలీప్, పాస్టర్ రాజారావు, ఇందిరమ్మ, బుజ్జమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌కు సావిత్రిబాయి పూలే ఉత్తమ అవార్డు రావడం అభినందనీయం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌కు సావిత్రి బాయి పూలే ఉత్తమ అవార్డు రావడం అభినందనీయమని పలువురు కొనియాడారు. డిసెంబర్ 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వ హించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో పలు సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవం కోసం పోరాడిన విష్ణువర్ధన్‌కు సుందర య్య విజ్ఞాన కేంద్రంలో హైకోర్టు జస్టిస్ డాక్టర్ రాజారాణి చేతుల మీదుగా అవార్డు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు రమేష్, ప్రతిభ, లక్ష్మి, తదితరులున్నారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్లస్టర్ లెవెల్ క్రీడలు

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట నెహ్రూ మెమోరియల్ స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌వైకేఎస్‌ఆర్‌డి (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో మంగళవారం క్లస్టర్ లెవెల్ క్రీడలు నిర్వహించారు. అందులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ క్రీడలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్,రన్నింగ్, బ్యాట్మెంటన్ క్రీడలు కొనసాగాయి.కార్యక్రమంలో క్రీడల ఇంచార్జ్ డాక్టర్ జి.పం దరి, ప్రియ,సరిత రాణి,రేష్మాదేవి,అంజిబాబు,రవీందర్, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

గాయపడిన బాధితుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల కేంద్రానికి చెందిన మోతే నరసింహులు ఇటీవలే ప్రమాదంలో గాయపడి.. వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి.. మంగళవారం ట్రస్ట్ సభ్యులతో కలిసి బాధితుడుని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ.. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మొగులయ్య, సత్యనారాయణ, వెంకట్, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, ఉషన్న రాజు, ఆంజనేయులు యాదవ్, జైపాల్ రెడ్డి, బాలరాజ్ యాదవ్, బీరప్ప యాదవ్, శ్రీకాంత్ రెడ్డి నాయకులు ట్రస్ట్ సభ్యులు తదితరులున్నారు.

నిషేధిత మాంజా దారం విక్రయించొద్దు

నవతెలంగాణ-న్యాల్‌కల్



ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించొద్దని హద్నూర్ ఎస్ఐ చల్ల రాజశేఖర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ సందర్భంగా గాలిపటాలు అమ్ముతున్న వ్యాపారస్తులు తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. నిబం ధనలు ఉల్లంఘిస్తే.. ఐదేండ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి



నవతెలంగాణ-మునిపల్లి

ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ అన్నారు. మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద హెల్మెట్ ధరించడం వల్ల కలిగి ప్రయోజనాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి బయటపడేందుకు హెల్మెట్ కాపాడుకుంతుందన్నారు. వాహనదారులందరూ హెల్మెట్ ధరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు ఉంటాయని, జరిమానాలు విధించడంతోపాట కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

జాతీయ పోటీలకు విరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-సంగారెడ్డి : తెలంగాణ స్టేట్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 2024-2025 పోటీలు హైదరాబాదులోని కరా స్టేట్ అకాడమీలో ఘనంగా నిర్వహించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో కిడ్నార్మల్ పిల్లలతో కూడిన స్కేటింగ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ స్కేటింగ్ ప్రదర్శనలు ప్రేక్షకులు, తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల కోచ్‌లు, తమ పాఠశాలల విద్యార్థులను ఈ పోటీలకు తీసుకువచ్చి, అద్భుతమైన ప్రదర్శనలతో మెప్పించారు. ఈ పోటీల్లో విరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ఐదు స్వర్ణపతకాలు, ఏడు రజతపథకాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించారు. ఈ విజయం విద్యార్థుల కఠిన శ్రమకు, కోచ్‌ల అంకితభావానికి గుర్తింపు తెచ్చాయి. . వీరు జనవరి 31వ తేది నుంచి ఫిబ్రవరి 2వ తేది వరకు మధురైలో స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచి రాష్ట్రానికి గర్వకారణం పాఠశాల సిబ్బంది ఆకాంక్షించారు.

కొత్త ఏడాదిలోనైనా... రేషన్ కార్డులొచ్చేనా



- అదనపు పేర్ల నమోదు, మార్పుల్లేవు
- ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- కొత్త దరఖాస్తులకూ అవకాశం
- జనవరి 26 నుంచి మంజూరంటున్న సర్కార్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కొత్త రేషన్ కార్డులు ఎప్పుడా అని ఎదురు చూపు తప్ప చేతికందిందిలేదు. గత ప్రభుత్వంలో కార్డుల కోసం దరఖాస్తు చేసిన వాళ్లతో పాటు కొత్త ప్రభుత్వంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమం తీసుకున్న దరఖాస్తులు సైతం పెండింగ్‌లోనే ఉన్నాయి. కొత్త సంవత్సరంలోనైనా కార్డులిస్తారని జనం ఎదురు చూస్తున్నారు. ఇటీవల మంత్రివర్గంలో సూచన ప్రాయంగా కొత్త రేషన్ మంజూరు చేస్తామని లీకులిచ్చింది. జనవరి 26 నుంచి మంజూరు చేస్తామని చెప్పడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు పెరుగుతున్నాయి.

పేదలకు ఆహార భద్రత కోసం రేషన్‌కార్డుల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత ఉంది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదరికంలో ఉన్న కుటుంబాలకు రేషన్‌కార్డుల్ని మంజూరు చేయాలి. రేషన్ కార్డు ద్వారా ఇతర రూపాల్లో లబ్ధిపొందేందుకు అవకాశమున్నందున పేదలకు రేషన్‌కార్డు అనివార్యమైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటికే రేషన్‌కార్డులున్నాయి. అయితే కొత్తగా వేరుపడిన కుటుంబాలు, పెళ్లిళ్లు అయిన వాళ్లకు కార్డుల్లేవు. అదే విధంగా కుటుంబాల్లో కొత్తగా పుట్టిన వారి పేర్లు కార్డుల్లో చేర్చడడానికి అవకాశం ఇవ్వలేదు. దీంతో పెద్ద ఎత్తున రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేశారు. సిద్దిపేట జిల్లాలో 291400, మెదక్ జిల్లాలో 213855, సంగారెడ్డి జిల్లాలో 381375 రేషన్‌కార్డులున్నాయి. వీరికి ప్రతి నెలా 2050 రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు.

కొత్త కార్డుల కోసం ఎదురుచూపు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక కుటుంబాలకు రేషన్‌కార్డుల్లేవు. ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులున్నాయి. గత ప్రభుత్వంలో ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు దరఖాస్తు చేయని కుటుంబాలు కూడా దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షల ఆదాయ పరిమితి కల్గిన వాళ్లు అర్హులని చెబుతున్నారు. గతంలో ఎడెకరాల వరకు ఉన్న వాళ్లకు సైతం కార్డులిచ్చారు. ప్రస్తుతం కూడా పాత నిబంధనల ప్రకారమే కార్డుల్ని మంజూరు చేస్తామని మంత్రులు ప్రకటిస్తున్నారు. ప్రజా పాలనలో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ముద్రించిన ఫారంలో కాలం పెట్టలేదు. ప్రజల నుంచి డిమాండ్ రావడంతో తెల్లరేషన్‌కార్డు మీద దరఖాస్తుల్ని స్వీకరించారు. వాటిని సైతం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పినా కొన్ని చోట్ల పెండింగ్‌లోనే పెట్టారు. మూడు జిల్లాల్లో కలిపి 2 లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా గత ఆరేళ్ల కాలంలో పుట్టిన పిల్లల పేర్లు రేషన్‌కార్డుల్లో నమోదు చేయలేదు. పెళ్లిళ్లు అయి అత్తవారింటికి వచ్చిన వాళ్లకు కార్డులో పేరు నమోదు చేయలేదు. వీళ్లు సైతం పెద్ద ఎత్తున ఎదురు చూస్తున్నారు.

ఇతర అవకాశాలు పొందని వైనం

రేషన్‌కార్డు ద్వారా కేవలం బియ్యం మాత్రమే కాకుండా ఇతర సదుపాయాల్ని కూడా పొందేందుకు వీలుంది. ముఖ్యంగా రూ.10 లక్షల వరకు ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం పొందేందుకు అవకాశం కల్పించారు. ఆరోగ్యపరంగా ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది. రేషన్‌కార్డులేని వాళ్లకు ఉచిత వైద్యం అందని ద్రాక్షలా మారింది. కళ్యాణలక్ష్మి, షాద్‌ముబాకర్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఉపకార వేతనాల వంటి పథకాలకు కూడా రేషన్‌కార్డును అడుగుతున్నందున కార్డుల్లేని వాళ్లు లబ్ధిపొందలేకపోతున్నారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంటింటి సర్వే చేశారు. ఆ సందర్భంగా రేషన్‌కార్డు ఉందా..? అని అడిగారు. పేదలుగా ఏదైన ప్రభుత్వం నుంచి లబ్దిపొందాలన్నా రేషన్‌కార్డులనే క్రైటీరియగా తీసుకుంటున్నందున రేషన్‌కార్డు అవసరం పెరిగింది.

ఉగాది నుంచి సన్న బియ్యం

రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు ధర పెంచడంతో పాటు రాబోయే కాలంలో పేదలకు సన్న బియ్యం సరఫరా చేయాలని బావిస్తుంది. అందులో భాగంగా వచ్చే ఉగాది నుంచి రేషన్‌కార్డులపై సన్న బియ్యాన్ని సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దొడ్డు రకం బియ్యం సరఫరా అవుతుంది. గోదాముల్లో మగ్గిన పాత బియ్యం సరఫరా చేయడంతో పురుగులు పట్టి, మక్కిపోయిన బియ్యం ఇస్తున్నారు. దీంతో అన్నం రుచికరంగా ఉండట్లేదు. పైగా అన్నం ముద్ద అవుతుంది. అందుకే రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని ఇక్కడే ప్రజలకు ఉపయోగపడేలా సన్న బియ్యాన్ని సరఫరా చేయాలని సర్కార్ యోచిస్తుంది. త్వరలో సన్న బియ్యం పొందాలంటే అంతకు ముందే రేషన్‌కార్డు మంజూరు చేయాలి. అందుకే కార్డులేని పేదలు సర్కార్ నిర్ణయం కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

ఆరోగ్య పరిరక్షణపై గీతంలో అంతర్జాతీయ సదస్సు

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు సమాయత్తమవుతోంది. 'ఫార్మాస్యూటికల్, హెల్త్ సైన్సెస్ లో సమీకృత పోకడలు' అనే అంశంపై ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు, మూడ్రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సదస్సు నిర్వాహకులు డాక్టర్ ప్రతీక్ పాఠక్, డాక్టర్ ఆశిష్ ఆర్ ద్వివేది మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల నుంచి గౌరవనీయమైన విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులను ఒకచోట చేర్చి, ఫార్మాస్యూటికల్, కెమికల్, బయోలాజికల్, హెల్త్ సైన్సెస్ లలో సమగ్ర పరిశోధనా పోకడల తాజా పురోగతులపై చర్చించను న్నట్టు తెలిపారు. ఆయా ప్రముఖుల వినూత్న ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి ఒక వేదికను రూపొందించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. సహజ, ఆరోగ్య శాస్త్రాలలో సమకాలీన పురోగతులు, సవాళ్లపై అమూల్యమైన అవగాహనను కల్పించడమే గాక, ఈ సదస్సులో ప్లీనరీ సెషన్ లు, కీలక ప్రసంగాలు, విశిష్ట నిపుణులతో చర్చలు ఉంటాయ న్నారు. ప్రముఖ అంతర్జాతీయ వక్తలు అమెరికా (కాలిఫోర్నియా)లోని చాప్ మన్ విశ్వవిద్యాలయం ఫార్మసీ ప్రొఫెసర్ కీకావస్ పరంగ్, శ్రీలంకలోని వయాంబ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ ఎస్. జీవతయాపరన్, సింగపూర్ లోని నాన్యాంగ్ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గావో యోంగ్గయ్, మలేషియాలోని అంతర్జాతీయ వైద్య విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ త్యాగరాజన్ మాధేశ్వరన్, అమెరికాలోని సైటోమ్ఎక్స్ థెరప్యూటిక్స్ కు చెందిన డాక్టర్ రాఘవ శ్రీరామనేని, క్రోయేషియాలోని రూడర్ బోస్కావిక్ ఇన్ స్టిట్యూట్, ఇన్ఫర్మేషన్ అండ్ కంప్యూటింగ్ సెంటర్ కు చెందిన డాక్టర్ జురికా నోవాక్, దక్షిణ కొరియా చుంగ్ ఆంగ్ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ గంగరాజు గెద్ద తదితరులు పాల్గొని, తమ నైపుణ్యాలను సదస్యులతో పంచుకుంటారని వివరించారు.యువ శాస్త్రవేత్తలు తమ పరిశోనలను ప్రదర్శించడానికి, గుర్తింపు పొందేందుకు, ఉత్తమ పోస్టర్, బెస్ట్ ఓరల్ ప్రెజెంటేషన్, గౌరవనీయమైన యంగ్ సైంటిస్ట్ అవార్డులతో సహా ప్రతిష్టాత్మక అవార్డుల కోసం పోటీపడేందుకు కూడా ఈ సమావేశం ఒక అద్భుత అవకాశంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్, హెల్త్ సైన్సెస్ లో సమగ్ర ధోరణులపై పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నామని, ఎంపిక చేసిన పత్రాలను స్కోపస్-ఇండెక్స్ జర్నల్ తో పాటు కాన్ఫరెన్స్ అబ్ స్ట్రాక్ట్ బుక్‌లెట్‌లో ప్రచురిస్తామన్నారు. అవసరమైన వారికి రోజు వారీ అద్దె ప్రాతిపదికన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. పేర్ల నమోదు, రుసుము, ఇతర వివరాల కోసం డాక్టర్ ప్రతీక్ పాఠక్, డాక్టర్ ఆశిష్ ఆర్ ద్వివేదిలను సంప్రదించాలని, లేదా healthcarenext2025@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు.

క్రీడలతో సోదర భావం పెంపొందుతుంది

నవతెలంగాణ-జహీరాబాద్

క్రీడలతో సోదర భావం పెంపొందుతుందని రంగారెడ్డి జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ సునీల్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో ఖిజర్ యఫై గోల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా మంగళవారం రెండు లీగ్ మ్యాచులు జరిగాయి. డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీల్, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామరాజు.. స్థానిక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుభాష్ రాథోడ్, ట్రస్టు నిర్వాహకులు దేశెట్టి పాటిల్‌ల తో కలసి మాన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంతచక్కటి టౌర్ని నిర్వహించి స్థానిక యువకులను క్రికెట్‌పై మక్కువ పెంచే విధంగా ఖిజర్ యఫై చొరవ చూపడం అభినందనీయమన్నారు. రెండవ రోజు ప్రథమ పోటీలో జై సేవాలాల్ ఎలెవన్ మరియు మ్యాక్ బళ్లారి సీసీ జట్ల మధ్య జరిగిన పోటీల్లో బళ్లారి సీసీ విజయం సాధించి సేమి ఫైనల్లో ప్రవేశించింది. క్రాంతి 55 పరుగులు చేసి 2 వికెట్లు సాధించడంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ముఖ్య అతిధులు పిపి సుభాష్ రాథోడ్, జేకే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేశెట్టి పాటిల్ చేతుల మీదుగా అవార్డు ఇచ్చారు. రెండో పోటీలో నేషనల్ కలిమ్ ఎలెవన్ జైనూర్ మరియు ఏఆర్ఎం స్పోర్ట్స్ అచ్చంపేట జట్ల మధ్య జరిగిన పోరులో కలిమ్ జైనూర్ సీసీ విజయం సాధిం చి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది. వేయి రూపాయల నగదు, ట్రాఫీతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ముఖ్య అతిధులు డాక్టర్ సీతారామరాజు, డాక్టర్ సునీల్ కుమార్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ చైర్మన్ రాములు నేత, సన్ రోహి వైద్యశాల మేనేజర్ మహమ్మద్ నజీర్, అదం యఫై, అబుద్ యఫై, తహ యఫై, నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సంతోష్ గుప్త, తులసీదాస్ గుప్త, వ్యాఖ్యాతలు అబ్దుల్లా సిద్దిఖీ, మొహమ్మద్ ఫెరోజ్, మీడియా ఇంచార్జ్ సయ్యద్ మహెబూబ్ అలీ, మెయిన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలి



నవతెలంగాణ-మునిపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి శశి కుమార్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశి కుమార్, మాజీ ఎంపీపీ చంద్రయ్య, మండల సీనియర్ నాయకుడు పరశురాంగౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి వేస్తామని చెప్పి రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను ప్రవేశపెట్టి సగం మందికే రైతు రుణమాఫీ చేసి రైతులను నట్టేట ముంచిందన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఎకరాకు రూ.15వేలు ఇస్తాం, రెండు లక్షల లోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తామనిచెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు రైతు భరోసా చేయలేక రైతులకు భరోసా కల్పించలేకపోయిందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండు లక్షల వరకు ఉన్న రైతు రుణాలను, రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలనిడిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెలిమలలో తీవ్ర ఉద్రిక్తత

- సర్వే నంబర్ 434 వద్ద పోలీసుల మోహరింపు
- తాండావాసులు పోలీసుల మధ్య ఘర్షణ వాతావరణం

నవతెలంగాణ-రామచంద్రాపురం





తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని వెలిమెల గ్రామంలోని సర్వే నెంబర్ 434లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. బిలాదాఖలు భూమి లో గిరిజనులు సుమా రు 40ఏండ్లుగా సాగు చేసుకుంటూ పొజిషన్లో ఉన్నప్పటికీ.. అధికారులు అపర్ణా, మే ఫేర్ సంస్థలకు వత్తాసు పలుకుతూ తమకు చెందాల్సిన భూమిని వారికి కట్టబెడుతున్నారని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగ ళవారం 434 సర్వే నెంబర్ వద్ద ప్రైవేట్ సంస్థ వ్యక్తులు జెసిబిలతో పనులు చేసేందుకు రావడంతో గిరిజనులకు వారికి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని సముదాయించారు. అనంతరం గిరిజనులు మాట్లాడుతూ.. వందలాది మంది పోలిసులు భూమి వద్దకు చేరుకొని పేదల భూములను కాజేస్తున్న అపర్ణా కన్స్ట్రక్షన్, మే ఫెయిర్ కన్స్ట్రక్షన్ కంపెనీల వారికి సహకరిస్తూ రైతులను బెదిరిస్తున్నారని, బౌన్సర్లను పెట్టి హంగామా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధి కారులకు మొరపెట్టుకున్నా న్యాయస్థానాలు తమకు అనుకూ లమైన తీర్పు ఇచ్చినా బడా బాబులకు అధికారులు సహకరిస్తూ కోట్ల విలువ చేసే భూములను కాజేసేందుకు సహకరిస్తున్నార న్నారు. ఏది ఏమైనా తమకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గిరిజనులు భూముల వద్దనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

శారద హాస్పిటల్ గుర్తింపు రద్దు చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజల నుంచి లక్షల ఫీజులు వసూలు చేస్తున్న శారద హాస్పిటల్ గుర్తింపుని రద్దు చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో డీఎండీహెచ్ఓ కార్యాల యంలో సూపరింటెండెంట్‌కి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ హాస్పిటల్లో పని చేయకుండా తన సొంత హాస్పిటల్‌లో పనిచేస్తున్న డాక్టర్ విజయభాస్కర్‌రావును ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం. యాదగిరి మాట్లాడుతూ.. సంగారెడ్డిలో గల శారద మల్టీ స్పెషల్ హాస్పిటల్‌లో ఇష్టారీతిన అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. డాక్టర్ విజయ భాస్కరరావు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయకుండా.. తన సొంత హాస్పిటల్ పెట్టుకొని ప్రజల నుంచి ఇష్టానుసారంగా దోచుకుంటున్నారన్నారు. డెలివరీ కోసం మా హాస్పిటల్‌కు రండి అని రెఫర్ చేసుకుంటున్నాడని ఆరోపించారు. పేద ప్రజలకు సేవలు చేయాల్సిన డాక్టర్లు.. డ్యూటీకి వెళ్లకుండా వారికి సొంతంగా ఉన్న ప్రయివేటు ఆసుపత్రుల్లోనే ఎక్కువగా ఉంటున్నారన్నారు. దాంతో ప్రభుత్వాసుపత్రికి వచ్చే సామాన్య జనానికి నాణ్యమైన వైద్యం అందడం లేదన్నారు. అంతేకాకుండా శారద హాస్పిటల్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేక రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. టెస్టుల పేరు మీద కూడా దోచుకుంటున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పటల్‌కి వెళ్లకుండా తన సొంత హాస్పిటల్‌కి ఎక్కువగా టైం ఇస్తున్న డాక్టర్ల పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు విట్టల్, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు మాత్రమే వారి కులవృత్తిపై హక్కు కల్పించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



నాయీ బ్రాహ్మణ కుల వృత్తిపై కేవలం నాయీ బ్రాహ్మణులకే హక్కును కల్పించాలని నాయీ బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సంగారెడ్డి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మంజీరానగర్ విద్యుత్ శాఖ యూనియన్ కార్యాలయాల్లో జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నాగభూషణం అధ్యక్షతన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్, కార్యదర్శి రమేష్, కార్మిక శాఖ అధికారి యాదయ్య మాజీ తాసిల్దార్ కిష్టయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాల్వాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్షౌరవృత్తి అనేది వంశపారంపర్యంగా వస్తున్నదన్నారు. కొన్ని కార్పొరేట్ సంస్థలు వృత్తిలోకి చొరబడి తమ పొట్ట కొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రజక వృత్తిని ఇతరులు నిర్వహించరాదని ప్రభుత్వం ప్రత్యేక జీవోను జారీ చేసిందని, క్షౌరవృత్తిని కూడా ఆ జీవో పరిధిలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ శివకాంతం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్, ముఖ్య సలహాదారులు సాయినాథ్, కోశాధికారి సత్యం, ఉపాధ్యక్షులు వీరన్న, వీరభద్రఅంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి భక్తులకు ఆహ్వానం



నవతెలంగాణ-సంగారెడ్డి : సంగారెడ్డిలోని శ్రీవేంకటేశ్వర హరిహర క్షేత్రంలో ఈనెల 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు తోపాజి అనంతకిషన్ ఆహ్వానం పలికారు. మంగళవారం హరిహర క్షేత్ర ఆలయ కమిటీ సభ్యులతో మీడియా సమా వేశం నిర్వహించి మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కేంద్రం లోని బైపాస్ రహదారి బాలాజీనగర్‌లో ముక్కోటి ఏకాదశికి పట్టణ ప్రజలకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఈనెల 10వ తేదిన వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని మాజీ ఎమ్మె ల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూర్తి సహాయ సహకారాలతో ముక్కోటి ఏకాదశికి ఆలయంలో శ్రీవెంకటేశ్వరుని ఉత్తర ద్వారదర్శనానికి భక్తులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో బైపాస్ రోడ్డులో జగ్గారెడ్డి సహకారంతో ప్రత్యేకంగా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఉదయభాస్కర్,నాగరాజు ఆలయ కమిటీ సభ్యులు అనిల్ కుమార్, శ్రీనివాస్, శివకుమార్, మధుసూదన్ రెడ్డి, అంజయ్య, వేంకటేశ్వరరావ్, విజయ్, శేఖర్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని శ్రీ వాగ్దేవి హైస్కూల్ కరస్పాండెంట్ ఎ.ఉదయ్ భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎం.స్టేట్ ట్రెజరీ, పటాన్‌చెరు పీఏసీఎస్ చైర్మెన్ పట్లోల్ల రాఘవేంద్రరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిన్నారం మండల ప్రైవేట్ స్కూల్ కరస్పాం డెంట్లు హాజరై కేక్ కట్ చేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు జన్మదినం శుభాకాంక్షలు తెలిపిన వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్వాల్ హరి కృష్ణా రెడ్డి, ఎస్.వెంకట్ రావు, ప్రభుకుమార్, ఉమా మహేశ్వర రావు, సుకృత్ కుమార్, శ్రీనివాస్, సింహాచలం, నాగబాబు, కరుణ సాగర్‌రెడ్డి, రాఘవరెడ్డి, జావిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన ట్రెయినీ కలెక్టర్

నవతెలంగాణ-ఝరాసంగం



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సంగారెడ్డి జిల్లా ట్రెయినీ కలెక్టర్ మనోజ్ మంగళవారం పరిశీలించారు. కార్యాలయంలోని పలు రికార్డులతో పటు సిబ్బంది పనితీరును గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 2022-2023 బ్యాచ్‌కు సంబంధించిన ట్రెయినీ కలెక్టర్‌నని, నెల రోజులపాటు ఇక్కడే పని చేయనున్నట్టు చెప్పారు. కొన్ని రోజులపాటు మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాలను సందర్శించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంతాల కంటే ఇక్కడి గ్రామీణ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తాం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



పోచమ్మ గుడి నిర్మాణానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో గల 19వ వార్డు పోచమ్మ బస్తీలో గల పోచమ్మ గుడి స్లాబ్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బాచుపల్లి సంధ్య జైపాల్ రెడ్డి, కౌన్సిలర్ వి.హనుమంత్‌రెడ్డి, కె.రాజిరెడ్డి, కె.కృష్ణా రెడ్డి, తూపల్లి కిరణ్ కుమార్ రెడ్డి,నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-సిర్గాపూర్

మండలానికి చెందిన సున్నం శివాజీరావుకు మంజూరైన రూ.44000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే ఆదేశానుసారం డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు పాటిల్, ఎస్సీ సెల్ సిర్గాపూర్ మండల అధ్యక్షులు కృష్ణ, జమీల్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు వేయడానికి స్థల పరిశీలన

నవతెలంగాణ-మనూర్



ఉపాధి హామీలో కొత్తగా రోడ్లు వేసేందుకు ఎంపీడీఓ మహేష్‌రావు మంగళవారం స్థల పరిశీలన చేశారు. నాగలిగిద్దా మండలంలోని రత్నానాయక్ తాండా నుంచి వాసర్ వరకు, కొండా నాయక్‌తాండా నుంచి గొప్యా నాయక్ వరకు రోడు వేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ రోడ్లు వేస్తే కంగ్టి, సిర్గాపూర్, నారాయణ ఖేడ్ మండలాల ప్రజలకు ఉపయోగం ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు. పనులు మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. అయన వెంట పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, తాండావాసులు పాల్గొన్నారు.

సీసీరోడ్డుకు శంకుస్థాపన



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలో గల 6వ వార్డు బాలాజీనగర్ కాలనీలో రూ.30 లక్షల మున్సిపాల్టీ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మున్సిపాలిటీ చైర్ పర్సన్ కోలన్ రోజా బాల్ రెడ్డి, స్థానిక కౌన్సలర్ గుండ్ల సుజాత మహేందర్‌రెడ్డిలతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈ కిష్టయ్య, ప్రశాంత్, కాలనీవాసులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.



ఫార్మేషన్ రోడ్డు పనుల పరిశీలన

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో కొద్ది రోజుల క్రితం చంద్‌ఖాన్‌పల్లి చౌరస్తాలో గల హనుమరెడ్డి సమాధి వద్ద నుంచి రాజన్న దాబా కంకి రోడ్డును కలిపే బైపాస్ నూతన ఫార్మేషన్ రోడ్డును ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం శంకుస్థాపన చేసిన విషయం విధితమే. ఈ రోడ్డు పనులను జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోల్ల సుధాకర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు.. ఈ కార్యక్రమంలో పండరెడ్డి, రామకృష్ణ మాజీ ఎంపీటీసీలు, నర్సింలు కౌన్సిలర్,జ్ఞానేశ్వర్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-జహీరాబాద్

నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కాశీనాథ్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని పతంగి అమ్మకం దారులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ది ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 సెక్షన్ 5 ప్రకారం చైనా మాంజాను నిషేధించినట్టు ఎస్ఐ చెప్పారు. చైనా మాంజాను విక్రయిస్తే ఈ చట్టం ప్రకారం ఐదేండ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారన్నారు. అంతేకాకుండా వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 ప్రకారం సెక్షన్ 51 ప్రకారం ఏడేండ్ల జైలు శిక్ష, పదివేల జరిమానా ఉంటుందన్నారు. కాబట్టి ఈ నిషేధించబడిన చైనా మాంజాను ఎవరు కూడా విక్రయించొద్దన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఏ షాప్‌లోనైనా చైనా మాంజాను విక్రయిస్తే.. 8712656763కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరపాలి

- ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వచ్చిన దరఖాస్తులను వ్యక్తిగత విచారణ జరిపి, గ్రామసభల్లో చర్చించి పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎక్కడ కూడా.. ఇండ్లు ఉన్న వారికి లబ్ది చేకూరిందని.. లేని వారికి ఇవ్వలేదన్న ఫిర్యాదు రాకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు ఇందిర మహిళలకు లబ్దిదారులుగా ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకంగా వ్యవహరిం చాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే లో పెండింగ్ ఉన్న వాటిని, గ్రామాల్లో లేని వారిని గ్రామాలకు పిలిపించి వారి వివరాలు సేకరించి సర్వే పూర్తయ్యేలా చూడాలన్నారు. జిల్లాలోని కొల్లూరు, తెల్లాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అంగన్వాడి కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసేలా జిల్లా వైద్యాధికారి, జిల్లా విద్యాధికారి, డిడబ్ల్యువోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్దిదారులకు అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాలు లబ్దిదారులతో చర్చించి ఇందిరమ్మ ఇండ్ల కింద బదిలీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కొల్లూరు తెల్లాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో సొసైటీల ఏర్పాటు కోసం సహకార శాఖ అధికారులతో చర్యలు చేపట్టాలని అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఇండ్లు లబ్దిదారులకు అందజేసేలా అధికారులు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, హౌసింగ్ పీడీ. చలపతి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, కాంట్రాక్టులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

నవతెలంగాణ-సంగారెడ్డి, జోగిపేట



విద్యార్థులు, ఉపాధ్యాయులు న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ సూచించారు. ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ సంగారెడ్డి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర ఆదేశాలతో మంగళవారం సంగారెడ్డిలో నిర్వహిస్తున్న జోగిపేట శాఖ మహాత్మా జ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో జాతీయ న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. విద్యా ర్థులు అన్ని చట్టలపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాలన్నారు. న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలో వారికి వివరించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారి బాగోగులను కూడా చూడాలని, పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత ఎలా ఉందో తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్‌ను విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో సంపూర్ణ విద్య అందించాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

అంగన్వాడి టీచర్లు సంపూర్ణ విద్య అందించడమే బాధ్యతగా అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి అంగన్వాడి టీచర్లకు సూచించారు. ముందుగా రేజింతల్ సిద్ధి వినాయక ఆలయాన్ని మంగళవారం సందర్శించి.. ప్రత్యేక పూజలు చేసి దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ కమి టీ నిర్వాహకులు సత్కరించారు. అనంతరం న్యాల్‌కల్ మండలంలో అంగన్వాడీ టీచర్లకు ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో లలిత కుమారి మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాలు సక్రమంగా నడపాలని, సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. డిస్టిక్ కోఆర్డినేటర్ సౌమ్య సమావేశంలో మాట్లాడుతూ.. గర్భిణీలకు సంపూర్ణ భోజనం అందించాలని, పిల్లల హాజరు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మహిళల బాలికల చట్టలపై అవగాహన కల్పించారు. హెల్ప్‌లైన్ వాడి బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు సక్రమంగా నిర్వహించకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ అంజమ్మ, డీఈఓ కిరణ్ కుమార్, సూపర్వైజర్ అనిత కుమారి, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కింద రూ.15 వేలు ఇవ్వాలి

నవతెలంగాణ-గుమ్మడిదల



ఇచ్చిన హామీ ప్రకారం రైతుభరోసా కింద రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలను అందించామన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. పథకాలకు సైతం కోతలు విధిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షల వరకు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ గంగాభవానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ఉద్యమ నేత మంద భాస్కర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, మంగయ్య, నక్క వెంకటేష్ గౌడ్, చిమ్ముల నరసింహారెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, తుపాకుల రాజు, సంగం శేఖర్ గౌడ్, మేడిపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

మరిగమ్మ జాతరను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జహీరాబాద్



గిరిజనుల కొంగుబంగారమైన మరిగమ్మ జాతరను డివిజన్ పరిధిలోని అధికారులందరూ కలసి సమన్వయంతో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఉప్పర్పల్లితాండా, జంగారెడ్డిపల్లి మరిగమ్మ మోతిమాత జాతర ఈనెల 13,14 తేదీల్లో జరగనున్నది. ఈ నేపథ్యంలో జాతర మహోత్సవాల కోసం అన్ని శాఖల అధికారులతో మంగళవారం కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాటాడుతూ.. ప్రతీయేడు లాగే ఈసారి కూడా జాతరను ఘనంగా నిర్వహించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఈయేడు కూడా ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. జాతర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. జాతరను ఘనంగా నిర్వహించాలని.. అందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఎక్సైజ్ పంచాయతీరాజ ఆర్డబ్ల్యూఎస్ వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేష సింగ్ రాథోడ్, గౌరవ అధ్యక్షులు కిషన్ పవార్, అసోసియేట్ అధ్యక్షులు శంకర్ నాయక్, బీఆర్ఎస్ జనరల్ సెక్రెటరీ గోపాల్, ఉప అధ్యక్షులు నారయణ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి ఓవరం



నవతెలంగాణ-జహీరాబాద్

ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరంలా ఉపయోగపడుతున్నదని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంఘం, మొగుడంపల్లి జహీరాబాద్ మండలాలకు చెందిన లబ్దిదారులకు సుమారు రూ.7 లక్షల పైచిలుకు విలువ గల చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు రకరకాల వ్యాధులతో ప్రజలు ఇబ్బందులకు గురై వైద్యశాలల్లో చేరుతు న్నారన్నారు. అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరమన్నారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన ఏడుమంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదల అయిన రూ.2,76,000విలువ గల చెక్కులను నాయకులు నామ రవికిరణ్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు వెంకటేశం, సంజీవరెడ్డి, తట్టు నారాయణ లతోపాటు మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్,మాజి కౌన్సిలర్ అబ్దుల్లా ,సత్యం ,మూర్తుజా,ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు శివప్ప, ప్రభు,నరేష్ రెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీ ఓ సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్

ఆందోళన వద్దు.. జాగ్రత్తలు పాటిస్తే సరి

నవతెలంగాణ-జోగిపేట



హెచ్‌ఎంపీవీ(హ్యూమన్ మెటానియా వైరస్) అనేది అత్యంత సాధారణమైన వైరల్ ఇన్‌ఫెక్షన్ అని ఎండి జనరల్ మెడిసిన్, కన్సల్టేషన్ ఫిజీషియన్ డాక్టర్ వీరన్న అద్దంకి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వైరల్ ఇన్ఫెక్షన్స్‌లో ఒకటి చిన్నారులు, ముఖ్యంగా శిశువులు అలాగే 65 ఏళ్ల పైబడిన వృద్ధుల్లో లక్షణాలు త్వరగా కనిపిస్తాయన్నారు. తుమ్ము, దగ్గు, లాలాజలం ద్వారా ఒకరినుంచి మరొకరికి ఇది వ్యాప్తి చెందుతుంది. దగ్గు, తుమ్ములు, ముక్కు కారడం, గొంతు నొప్పి, తల నొప్పి, జ్వరం లాంటి లక్షణాలు ఉంటాయి. చాల వరకు ఎలాంటి చికిత్స లేకుండా మూడు నుంచి ఐదు రోజుల్లో తగ్గిపోతుంది

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

నీరు ఎక్కువగా తాగాలి. మాస్కు ధరించాలి. తరచూ సబ్బుతో కనీసం 20 సెకన్ల పాటు చేతులను కడుక్కోవాలి. చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లు, ముక్కు, నోటిని తాకకూడదు. దగ్గు, తుమ్ము వచ్చేప్పుడు నోరు, ముక్కును కవర్ చేసుకోవాలి. లక్షణాలు ఎక్కువగా ఉంటే అందుబాటులోని వైద్యులని సంప్రదించాలన్నారు.

వాస్తవాలు వెలికితీయడమే నవతెలంగాణ విధానం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాస్తవాలు వెలికితీయడమే నవతెలంగాణ విధానం అని బొల్లారం సీఐ రవిందర్ రెడ్డి అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్యతో కలిసి నవతెలంగాణ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ 2025ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిత్యం ప్రజల పక్షాన నిలబడడం లో నవతెలంగాణ ముందుంటుందన్నారు.రాజయ్య మాట్లాడుతూ.. నవతెలంగాణ ప్రజల పక్షాన నిరంతరం ఎన్నో సమస్యల్ని వెలికితీసి ప్రభుత్వానికి, ప్రజలకు వారిధిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలి

నవతెలంగాణ-గుమ్మడిదల



స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సంసిద్ధం కావాలని పార్టీ మండలాధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ఎండగడుతూ అన్ని గ్రామాల్లో సామాన్య ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మండలంలో ఉన్న సర్పంచులతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మెన్, కార్పొరేట్ అన్ని స్థానాలను బీఆర్ఎస్సే కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, నక్క వెంకటేష్ గౌడ్, అభిశెట్టి రాజశేఖర్, తుపాకుల రాజు, మల్లేష్ గౌడ్, మొగులయ్య దాసరి ఆంజనేయులు, సంగం శేఖర్ గౌడ్, మేడిపల్లి మురళి, గడ్డం హనుమంత్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, భూపాల్, శ్రీనివాస్, దోమడుగు శంకర్, ఫయాజ్ షరీఫ్, శ్రీనివాసరెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

నవతెలంగాణ
మెదక్
బుధవారం | 08 జనవరి 2025 | www.navatelangana.com

టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి సాంగని యాదగిరి ఆధ్వర్యంలో టీఆర్‌టీఎఫ్ కాలమానిని మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ నిజాంపేట మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్ రత్నాకర్, మహేశ్వర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి దేశపతి మోహన్, సంఘ సభ్యులు వినయ్, స్వామి, శివ, రాజయ్య శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, శ్రీనివాస్, రాజేందర్, శ్రీకాంత్, ఇంతియాజ్, భాను, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



భరోసా కేంద్రంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం

నవతెలంగాణ-మెదక్



మెదక్ భరోసా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు కోర్టుకి రాకుండా తమ వాంగ్మూలాన్ని నేరుగా భరోసా సెంటర్ నుంచి కోర్టుకి నివేదించవచ్చని తెలిపారు. ఇక నుంచి పోక్సో కేసు బాధితులు అందరూ ఇక్కడి నుండే తమ సాక్ష్యాలను కోర్టుకి తెలియజేస్తారని తెలిపారు. అనంతరం భరోసా సిబ్బంది పనితీరును పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ మహేందర్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్స్ శ్వేత సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో బేటి బచావో



నవతెలంగాణ-తూప్రాన్

పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు నైతిక విలువలను పెంపొందించడంపై మంగళవారం అవగాహన కల్పించారు. బేటి బచావో రెస్పెక్ట్ గర్ల్స్ స్మార్ట్ లివింగ్ పేరుతో ఆలోచింపజేసే కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ టి.రామకృష్ణారావు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభ, ప్రదర్శన ద్వారా అర్థవంతమైన సందేశాన్ని అందించడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు ఏఎస్ఐ లక్ష్మీ, షీ టీమ్స్ హెడ్ స్వరూప, క్లిష్టమైన అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రామకృష్ణారావు, పాఠశాల డీన్ అశోక్, ఉపాధ్యాయులు రాజేష్, ప్రసాద్, శ్రీధర్, శేఖర్, పాల్గొన్నారు.

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలి

నవతెలంగాణ-మెదక్

బస్సులో ఉన్న ప్రయాణించే ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్టీసీ డిపో డీఎం సురేఖ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా డిపోలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో ఆమె మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళ ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డిసెంబర్ నెలలో అత్యధిక ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు క్యాష్ అవార్డు,శాలువాతో సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో డిటిఓ వెంకట స్వామి, రీజినల్ మేనేజర్ ప్రభులత తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని శౌకత్ పల్లి గ్రామానికి చెందిన మడవత్ జాంల్కీకి రూ. 40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకులు అందించారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న నిరుపేదలకు సీఎంఆర్ ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహాయ సహకారాలతో చెక్కులు మంజూరు కావడంతో షౌకత్‌పల్లి గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురా రాములు, సూర్య నాయక్, రాజు నాయక్, లాల్యా నాయక్, పాకీరా నాయక్, జైపాల్ నాయక్, శంకర్ నాయక్, మహిపాల్ నాయక్, రవి నాయక్, పాల్గొన్నారు.

పేద ప్రజలకు వరంగా సీఎంఆర్‌ఎఫ్

నవతెలంగాణ-నిజాంపేట



నిరుపేదలకు వరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అందే స్వామి అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో గ్రామానికి చెందిన కుమ్మడి జీవన్ రెడ్డికి రూ.36 వేలు, సౌడ స్వామికి రూ.58 వేలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధిత కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనాంపల్లి రోహిత్ రావు సహకారంతో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని బాలరాజు, చాకలి నాగరాజు, పిట్ల ఆంజనేయులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన హెడ్మాస్టర్‌కు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పనిచేసిన ప్రభాకర్ బదిలీపై చిన్న శంకరంపేటకు వెళ్లారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ ఆధ్వర్యంలో ప్రభాకర్‌ను, ఎంఈఓ సాంగని యాదగిరిని ఉపాధ్యాయ బృందం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గత ఐదు సంవత్సరాల తీపి గుర్తులను పాఠశాలలోని ఉపాధ్యాయులతో విద్యార్థులతో కలిసి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తనపై ప్రేమాభిమానాలు చూపి తనను సన్మానించిన ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాజేందర్, శ్రీలత, శ్రీనివాస్, ప్రమీల, బాల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

నవతెలంగాణ-శివ్వంపేట

గత కొంత కాలంగా మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినది. ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చెంది గ్రామ శివారులో గత కొన్నిరోజులుగా ఒక గుర్తు తెలియని మహిళా (45) మతిస్థిమితం లేకుండా తిరుగుతోందని, గ్రామ శివరులోని జేఎస్ఆర్ ఫంక్షన్ హల్ ఎదురుగా మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం బలం గా ఢీకొనడంతో ఆమె తలకు, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా గాయపడిన మహిళా అక్కడికక్కడే మరణించిందని ఎస్ఐ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి బర్ల యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి ఒంటిపై నల్లటి చీర, నల్లటి జాకెట్ ధరించి ఉందని, యాచాకురాలిగా ఉన్న మహిళను ఎవరైనా గుర్తుపట్టినట్ల యితే శివ్వంపేట పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

పల్లె దావఖాన ప్రారంభం కాలే

- రూ.2 కోట్లతోప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరి
- స్థల పరిశీలన జరిగినా ఫలితం లేదు
- వైద్య అధికారుల నిర్లక్ష్యంతో ఆగిన శంకుస్థాపన



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో పల్లె దేవాఖాన కట్టించి సంవత్సరం దాటినప్పటికీ నేటికీ ప్రారంభం కాలే. ప్రతి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ మండల కేంద్రంలో ఇప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక ఎంతోమంది పేషెంట్లు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలాల పునర్విభజనలో భాగంగా నిజాంపేట మండలం ఏర్పడి దాదాపు 9 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కట్టించకపోవడమేమిటని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు రూ. 2 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేసినప్పటికీ వైద్య అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు పలువురు ఆరోపిస్తున్నారు. వైద్య అధికారులను వివరణ కోరితే రెవెన్యూ అధికారులు ల్యాండ్ మార్క్ అప్ప చెప్పలేదని తెలిపారు. మండల తహశీల్దార్‌ను వివరణ కోరగా వైద్యాధికారులు ఇప్పటివరకు ఎవరు తమ ఆఫీసుకు రాలేదని, వచ్చినట్లయితే వెంటనే స్థలాన్ని వారికి అప్పజెప్తామని తెలిపారు. దేవుడు కరుణించినా పూజారి కనికరించడం లేదనే చందంగా జిల్లా వైద్యాధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- మండల వ్యవసాయ అధికారిని లావణ్య

నవతెలంగాణ-శివ్వంపేట



తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో ఆయిల్ పామ్ పంటను సాగు చేసి అధిక లాభలను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారిణి లావణ్య అన్నారు. మంగళవారం మండలంలోని మల్లుపల్లి గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగులో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎఓ మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి నిరంతర దిగుబడి వస్తుందని, ఎకరాకు 10 నుంచి 12 టన్నుల ఆయిల్ పామ్ దిగుబడి సాధించవచ్చని వివరించారు. మార్కెట్ లో ప్రస్తుతం టన్ను ఆయిల్ ఫామ్ ధర రూ.21 వేలుగా ఉందని, భవిష్యత్ రోజులలో ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. నాటేటప్పుడు మొక్కకి మొక్కకి మధ్య 9 మీటర్ల దూరం ఉంటుందని, ఇందులో అంతర పంటలుగా ఇతర ఆరుతడి పంటలు వేసుకోవచ్చని, రైతులందరూ సాంప్రదాయ పంటలను వదిలి ఫామాయిల్ సాగు వైపు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి కలిగిన రైతులు ఫోన్ 9542618737 నెంబర్ కు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారిణి భువనేశ్వరి,ఫామ్ ఆయిల్ కంపెనీ ప్రతినిధి అజయ్, పాల్గొన్నారు

పట్లూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- చదువుకున్న స్కూలుకు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు
- ఎంపీ రఘునందన్ రావు





నవతెలంగాణ-కౌడిపల్లి

పట్లూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కొనియాడారు. మంగళవారం మండల పరిధిలోని కంచన్ పల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్లూరి ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ రావు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులను నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందరావును ఆహ్వానించారు. ముందుగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో స్వయానా గ్రామస్తులకు ఎంపీ రఘునందన్ రావు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ కంచనపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బాలకృష్ణ రావు గత కొన్ని సంస్థల క్రితం సొంత ఊరిలో ప్రాథమిక విద్యను అభ్యసించి పై చదువుల కోసం హైదరాబాద్‌లో చదువుకొని ప్రస్తుతం అమెరికా, తదితర ప్రాంతాలలో వ్యాపారులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో పట్లూరి ఫౌండేషన్ ఏర్పాటు చేసుకొన్నారని తెలిపారు. ఈ ఫౌండేషన్ ద్వారా మండలంలో వివిధ మందిరాలకు, విద్యాసంస్థలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారని కొనియాడారు. స్వయాన సొంత గ్రామంలో తాను చదువుకున్న కంచన్ పల్లి గ్రామంలోని ఉన్నంత పాఠశాలకు దాదాపు రూ.60 లక్షల నిధులను పట్లూరి ఫౌండేషన్ ద్వారా కేటాయిస్తామని తెలపడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డ వాళ్ళు చాలామంది ఉన్నారు. ఆర్థిక సహాయం చేసేవారు కొంతమంది ఉంటారని అందులో పట్లూరి ఫౌండేషన్ సేవలని అన్నారు. విద్యార్థులు ఏ రంగంలోనైనా ఎంచుకొని ప్రయత్నం చేస్తే సక్సెస్ అవుతారన్నారు. బట్టి చదువులు చదవకుండా ఇష్టంగా చదవాలన్నారు. మార్చి తర్వాత కంచన్పల్లి నుంచి లింగంపల్లి వరకు రోడ్డుకు నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, ఎర్రల మురళి యాదవ్, మల్లేష్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ గౌడ్, పట్లూరి ఫౌండేషన్ సభ్యులు నిమాద్రి రావు, తిరుపతిరావు, శ్రీనివాసరావు, కేశవ్ రావు, డిపోఓ రాధా కిషన్, ఎంఈఓ బాలరాజ్, బుచ్చిరెడ్డి, మండల బిజెపి పార్టీ అధ్యక్షులు రాకేష్, మాజీ సర్పంచ్ రాజేందర్, కృష్ణ పటేల్, మైపాల్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రాకపోవడంతో పంచాయతీ కార్మికుల బిక్షాటన

- నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని ఆవేదన



నవతెలంగాణ-శివ్వంపేట

ప్రభుత్వం అలంబిస్తున్న మొండి వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మంగళవారం గ్రామపంచాయతీ కార్మికులు బిక్షాటన చేశారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ లింగోజీగూడ గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ బిక్షాటన చేపట్టారు. నిత్యం ప్రజారోగ్యం కోసం పాటు పడుతూ, చాలీ చాలని జీతాలతో గ్రామాలకు సేవలందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత నాలుగు నెలలుగా వేతనాలు అందించడం లేదు. దీంతో తమ కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు ఎక్కువై, తమ పిల్లలతో కలిసి ఒక్కో పూట పస్తులుండాల్సిన పరిస్థితులొచ్చాయని గ్రామ పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమతో పారిశుధ్య పనులు చేయించుకుంటుందే తప్ప వేతనాలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు హరిజన్ బిక్షపతి, డప్పు రాములు పాల్గొన్నారు.

కాసింపూర్ గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం కాలేదు

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని కాసిం పూర్ తాండ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడినందున సర్పంచిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నట్లు వచ్చిన కథనాలు నిజం కాదని తండావాసులు తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన సందర్భంగా మేమందరం కలిసి కూర్చొని మాట్లాడుకుంటామని అందులో ప్రజలు ఏ విధంగా నిర్ణయించిన దాని ప్రకారం నడుచుకుంటామని ఏకగ్రీవం అయినా సరే, లేదా ఎన్నికలు జరిపించినా సరే త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత తెలియజేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీవోను వివరణ కోరగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత సర్పంచి పోటీకి నామినేషన్ ఎవరు కూడా వేయనట్లయితే అప్పుడు ఏకగ్రీవంగా ప్రకటించడం జరుగుతుందన్నారు. వార్డు మెంబర్లు ఎవరు కూడా నామినేషన్ వేయకుంటే ఏకగ్రీవంగా ప్రకటిస్తామని లేకుంటే ఎవరైనా వార్డ్ మెంబర్గా నామినేషన్ వేసినట్లయితే ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాల్ సింగ్, మోతిరామ్, ధరావత్ విట్టల్, ఎం. శంకర్, లక్ష్మణ్, లచ్చిరాం, చిన్న లక్ష్మణ్, సంగ్యా, గోప్య, మహిపాల్, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, డి శంకర్, సంత్రి, తదితరులు పాల్గొన్నారు

రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలి

- రహదారి భద్రత సమిష్టి బాధ్యత
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

రోడ్ ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రత చర్యలను చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హల్‌లో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమనిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. అతివేగం వల్ల వాహనాలు అదుపుతప్పి.. ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాలు తరుచూ జరుగుతున్న ప్రాంతాలను పోలీస్, నేషనల్ హైవే, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు గుర్తించాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ముఖ్య ప్రదేశాలలో ప్రమాద సూచికలు, మలుపుల వద్ద స్పీడ్ లిమిట్ సూచికలు తప్పనిసరిగా ఉండాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా నేషనల్ హైవే అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కళాశాలల యాజమాన్యాలు యువతకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం విశేష కృషి చేస్తుందన్నా రు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ సర్దార్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా రవాణా శాఖ అధికారి, మెదక్ మున్సిపల్ కమిషనర్, శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీలు, సిఐలు, నేషనల్ హైవే , పంచాయతీ రాజ్, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-నార్సింగి



ప్రాణం విలువ వెల కట్ట లేని దని, పోతే తిరిగి రాదని ఎస్సై అహ్మద్ మొహిఉద్దిన్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్ఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై చేసిన నాటక ప్రదర్శన, నృత్య ప్రదర్శన, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై ముగ్గులతో చిత్రాలు, ఉపన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని గుర్తు చేశారు. ప్రమాదల వల్ల ఎంతో మంది అంగవైకల్యంతో బాధపడుతున్నారని, వారి బ్రతుకులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయని తెలిపారు. ప్రయాణంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని పేర్కొన్నారు. మన భవిత మన చేతుల్లోనే ఉందని, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటామని సూచించారు. ఎం.ఈ.ఓ మురళీ మోహన్, ఏఎస్ఐ మానిక్ ప్రభు, కానిస్టేబుల్ బాల రాజ్ గౌడ్, మోహన్, కరుణాకర్, అజ్జు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై ముగ్గుల పోటీలు

- ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య



నవతెలంగాణ-వెల్దుర్తి

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య అవగాహన కల్పించారు. అనంతరం ట్రాఫిక్ సిగ్నల్ రోడ్డు భద్రత నియమాలు రోడ్డు భద్రతకు సంబంధించిన గుర్తులు, చిహ్నాలపై రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ట్రాఫిక్ సిగ్నల్ పాటించండి, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండండి, జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటండి, వేగ పరిమితిని పాటించండి, హెల్మెట్ ధరించండి, సీటు బెల్టు ధరించడంపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దు, మొబైల్ ఫోన్స్ ఉపయోగించి డ్రైవ్ చేయవద్దు, ఇతర వాహనదారులకు గౌరవం ఇవ్వండి, పిల్లలకు జాగ్రత్తగా చూసుకోండి, ఇంకా ఇతర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు

ఉమ్మడి జిల్లా ఎస్‌జిఎఫ్ సాఫ్ట్ బాల్ జట్టు ఎంపిక

నవతెలంగాణ-వెల్దుర్తి



మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14 బాల బాలికల సాఫ్ట్ బాల్ జట్టు ఎంపిక మాసాయిపేట మండల కేంద్రంలోని మంగళవారం ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించినట్లు మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గంగాల రమేష్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి సుమారు 40 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరయ్యారని తెలిపారు. స్కూల్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను తుది జట్టుకు ఎంపిక చేసామని తెలిపారు. ఈ జట్టు మెదక్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్ 14 బాల బాలికల ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమానికి మాసాయిపేట మండల విద్యాధికారి లీలావతి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు కరాచలం చేసి మనోధైర్యాన్ని నింపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ధర్మపురి వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు స్థానిక ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్యాంసుందర్ శర్మ పద్మ రాజకుమార్ రేణుక వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు వీక్షించి లాభాలు పొందాలి

- జిల్లా వ్యవసాయ అధికారి





నవతెలంగాణ-నార్సింగి

రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులకు వివిధ పంటల యాజమాన్య పద్ధతులు గురించి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తలు పాల్గొని వివరిస్తారని తెలిపారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో యాసంగిలో మొక్కజొన్న పంట సాగు పద్ధతులు, చీడ పీడల, నీటి, ఎరువుల యాజమాన్యం గురించి వివరించడం జరిగింద న్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన రైతులకు మొక్కజొన్న సాగులో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం మెలుకువలు తెలిపారన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ప్రతి మంగళవారం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకొని పంటల సాగులో తమ వ్యవసాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట వ్యవసా య డివిజన్ ఇంచార్జి ఏడిఏ రాజ నారాయణ, నార్సింగి, నిజాంపేట్ మండలాల వ్యవసాయ అధికారులు యాదగిరి, సోమ లింగారెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారినిలు విజృంభన, దివ్య రైతులు పాల్గొన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-శివ్వంపేట



ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా దేశంలోనే మొట్టమొదటి సారిగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రప్రథమంగా నిర్మితమైన, అత్యంత శక్తిపీఠాలలో ఒకటైన శివ్వంపేట శ్రీ బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అమ్మవారికి మహాపూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్షి శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో బగలాముఖీ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి మహాపూజలతో పాటు రుద్రయామల బగలా అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి పసుపుతో అర్చన (హరిద్రార్చన) నిర్వహించడమే కాకుండా అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించి, వివిధ రకాల ఫలాలతో నైవేద్యం సమర్పించడం జరిగినది. బగలాముఖీ అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు హాజరైన భక్తులు మొక్కులు చెల్లించుకోగా, సుదర్శన్ గౌడ్ భక్తులకు స్వంతంగా పులిహోర, శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బగలాముఖీ ట్రస్ట్ సభ్యులు పత్రాల శ్రీనివాస్ గౌడ్, అధికార సభ్యులు సూర్యకుమార్ గౌడ్, కొడకంచి సుదర్శన్ గౌడ్, కాముని నగేష్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, రాజీపేట కిషన్, పాల్గొన్నారు.

పశువులకు రోగ నిరోధక టీకాలు వేయించుకోవాలి

-జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

రైతులు పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు రోగ నిరోధక టీకాలు వేయించుకోవాలని సిద్దిపేట జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకట్ రెడ్డి, కోరారు. ఈ సందర్భంగా మండలంలోని మర్మముల శివారు బంజారా గ్రామంలో ఫర్టిలిటీ క్యాంపు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధి టీకాలు వేసినట్టు తెలిపారు. రైతులు పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హరికృష్ణ, నితిన్ కుమార్, ఉషారాణి, వీఎల్‌ఓ పరువయ్య, విజయ డైరీ చైర్మన్ జంగిలి మల్లేశం, కార్యదర్శి ఇండ్ల చంద్రమౌళి, డైరెక్టర్ మీసా సత్యనారాయణ, రైతులు స్వామి, బిక్షపతి, స్వామి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-మద్దూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఇండ్లను ఎంపీడీవో రామ్మోహన్, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ధర్మారం, వంగపల్లి, వల్లంపట్ల, గ్రామలలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేసిన ఇండ్లను తన లాగిన్లకు వచ్చిన ఇండ్లను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ వీరారాజు, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, కిరణ్ కుమార్, తదితరులు ఉన్నారు.

రేబర్తి గ్రామంలో జరిగిన పనుల పరిశీలన



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి గ్రామంలో జరిగిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పనులను విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ మమత, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను, కోఆర్డినేషన్ రిజిస్టర్‌తో పాటు వాటర్ సంబంధించిన ఏడు రిజిస్టర్లను పరిశీలించినట్లు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ గోపి, ఇంట్రా డీఈఈ కృష్ణ, అర్డబ్ల్యూఎస్ ఇంట్రా, ఏఈ ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, పంపు ఆపరేటర్ బాబా, తదితరులున్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, బీజేపీ నాయకులు సాయిరెడ్డి శంకర్ రెడ్డిల తండ్రి పోచంరెడ్డి ఇటీవల మృతిచెందాడు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, బీజేపీ నాయకులు గురువారెడ్డి, మదాడి జస్వంత్ రెడ్డిలు వారిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సింగం సత్తయ్య , రమేష్ గుప్తా వెంకట్రామిరెడ్డి, రాంరెడ్డి, అంజిరెడ్డి, తాడూరు మహేష్ గౌడ్, నర్సింలు, వెంకటేష్, తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



నవతెలంగాణ-దుబ్బాక

అనారోగ్యంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన దుబ్బాక మండల పరిధిలోని గంభీర్ పూర్‌కు చెందిన కే.బాలయ్యకురూ.20 వేలు, మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి వార్డుకు చెందిన ధర్మారెడ్డి, హైమావతిలకు మంజూరైన రూ.50 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం సీఎస్‌ఆర్ క్యాంపు కార్యాలయంలో అందజేసినట్టు కాంగ్రెస్ దుబ్బాక మండల అధ్యక్షులు కొంగర రవి తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీరామ్ నరేందర్, 20వ వార్డు ఇన్చార్జ్ ఐరేని సాయితేజ గౌడ్, రాకేష్, జోగురాజు, భూపతి ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు



నవతెలంగాణ-చేర్యాల

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని పాత బస్ స్టాండ్ వద్ద రైతు భరోసా సంబరాలను జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కొమ్ము రవి, దాసరి శ్రీకాంత్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పుర్మ ఆగం రెడ్డి, మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి, డీసీసీ సహాయ కార్యదర్శి మంచాల చిరంజీవులు, కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మెన్ లు ఆడెపు చంద్రయ్య, ముస్త్యాల కిష్టయ్య, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌ను కలిసిన రాగుల కృష్ణ



నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నాగరి ప్రీతంను నంగునూరు మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాగుల కృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రీతం అనుకున్న లక్ష్యాన్ని సాధించి అన్ని రంగాలలో విజయాన్ని పొందాలని శుభాకాంక్షలు తెలియజేశానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపాక విజయ్, రాగుల కనకయ్య, అల్లిబిల్లి నర్సింగరావు, గుడిమల్ల సతయ్య, జాజల కనుకరాజు, పోతుల మోహన్, నీల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

దుబ్బాక శాసనసభ నియోజకవర్గం పరిధిలో పెండింగ్‌లో ఉన్నా ఇరిగేషన్ కెనాల్స్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యతో కలిసి దుబ్బాక నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న ఇరిగేషన్ కెనాల్స్ నిర్మాణం, భూసేకరణపై ఇరిగేషన్, రెవిన్యూ, ఫారెస్ట్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు, ఇతర మెయిన్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణ పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అలాగే కాల్వల నిర్మాణానికి అవుసరమైన పెండింగ్‌లో ఉన్న భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే ఇరిగేషన్, రెవిన్యూ పోలీస్, సర్వే అధికారులు చెరువులను పరిశీలించి చెరువశిఖంలో పంటలు వేయకుండా చూడాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దుబ్బాక నియోజకవర్గంలో వంగిన కరంట్ పోల్స్, వంగిన వైర్స్, చెడిపోయిన ట్రాన్స్‌ఫర్మర్స్ ను పరిశీలించి సరిచేయాలన్నారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నదని నియోజకవర్గంలోని రైతులకు ఇబ్బంది కలుగకుండా సాగునీరు సరఫరా చెయ్యాలని, నిరంతరం నాణ్యమైన విద్యుత్ వ్యవసాయానికి, విద్యా సంస్థలకు, ఆసుపత్రులకు, గ్రామపంచాయతీలకు, గృహలకు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, కాళేశ్వరం ప్రాజెక్టు యూనిట్ 1 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీత, ఇరిగేషన్ ఈఈ నారాయణ, ఎస్ఇ ఎలక్ట్రిసిటీ చంద్రమోహన్, డిఇలు, ఏఇ లు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోటను పరిశీలించిన ఏడీఏ

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవ్పూర్ ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక ఆదాయం లభిస్తుందని ములుగు సహాయ వ్యవసాయ సంచాలకులు అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం జగదేవపూర్ మండలం తీగుల్ గ్రామంలో ఆయిల్ పామ్ పంటలో అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్న రైతు మల్లేశం తోటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను ధర రూ. 20,500 దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంత రావు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఖలీల్, భాను, కిరణ్, కృష్ణమూర్తి , కవిత తదితరులు పాల్గొన్నారు.



వరిలో కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా అందించకూడదు



నవతెలంగాణ-తొగుట

వరి పంటలో కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా అందించకూడదని వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్ద మాసాన్ పల్లి గ్రామ రైతు దాసరి దశరథం వరి సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ భాస్వరం మొక్క వేరు వ్యవస్థ పెరుగుదలకు సహాయపడుతుందని, భాస్వరాన్ని చివరి దుక్కిలో లేదా నాటిన 5 రోజుల లోపు వేయాలని అన్నారు. కాంప్లెక్స్, డిఎపి ఎరువులకు నెమ్మదిగా కరిగే స్వభావం ఉంటుంది కాబట్టి వీటిని పై పాటుగా అందించడం వలన కావలసి న సమయంలో పోషకాలు మొక్కలకు అందే అవ కాశం ఉండదని తెలిపారు. దీనివల్ల పంటకు ఎటు వంటి ప్రయోజనం ఉండదు పై గా భూమిలో భాస్వరం శాతం పెరగడం ద్వారా జింక్ పోషక లోపం ఏర్పడుతుందని వివరించారు. పంట కాలాన్ని బట్టి యూరియాను మూడు, నాలుగు దఫాలుగా వేసు కోవాలని పేర్కొన్నారు. యూరియాతో త్రీ జి, ఫోర్ జి గుళికలు కలపడం వలన గుళికల యొక్క సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. యూరియాతో పురుగుల మందు, కలుపు మందు లు కలిపి వాడరాదని సూచించారు. ఈ కార్యక మంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడమే ధ్యేయం..

- మైనార్టీ రెసిడెన్షియల్‌లను తనిఖీ చేసిన పూజల హరికృష్ణ, అత్తూ ఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

రెసిడెన్షియల్ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో డైట్ మెనూ ప్రకారం మంగళవారం విద్యార్థులకు పెట్టాల్సిన వంటలను వంట చేయలేకపోవడం పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డెన్, కాంట్రాక్టర్ కావాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నామ్ చేసేలా కుట్ర చేస్తున్నారన్నారు. కొందరు కాంట్రాక్టర్లు, అధికారులు, వార్డెన్లు బీఆర్ఎస్ నాయకులకు తొత్తుల్లాగా వ్యవహరిస్తున్నారు అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్టు చేసే అధికారులు తమ తీరును మార్చుకోకుంటే బదిలీ చేయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మహిళ ముద్దం లక్ష్మి బుచ్చిరెడ్డి, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, పాండు, కలీం ఉద్దీన్, గయ్యాజుద్దీన్, అక్బర్, తదిరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో విద్యుత్ ఏర్పాట్లు చేశాం

- బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు చిల్వేరి మల్లారెడ్డి



నవతెలంగాణ-తొగుట

ఎమ్మెల్యే సహకారంతో మల్లన్న గుడి వద్ద విద్యుత్ ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ మాజీ మండల ఆధ్యక్షుడు చిల్వేరి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని జప్తి లింగారెడ్డి పల్లి గ్రామ సమీపంలో సింగరాల మల్లన్న గుడి వద్ద గ్రామ ప్రజలు ప్రతి ఏడాది జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది గుడి ప్రంగణం గ్రామస్థులు, నాయకులు కలిసి అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్య కోసం స్థానిక దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని కలిసి సహకారం కోరామని అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే 16 స్తంభాలు, వైరు అందించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. కొద్ది రోజుల జాతర ఉత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా గుడి చుట్టూ, గుడి ముందట రెండు వైపులా రొడు పక్కన ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యుత్తు సమస్య కోసం ఎమ్మెల్యేను అడగగానే స్పందించి సహకరించినం దుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

విద్యార్థులకు మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్‌తో ఉన్నత భవిష్యత్తు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ ఇష్యూస్ ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్‌తో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఇందూర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీపీ.రాజు అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారులోనీ ఇందూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో వన్డే వర్క్ షాప్‌లో భాగంగా మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ ఇష్యూస్ ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి ముఖ్యఅతిథిగా సీఎం పార్టీ సీఈఓ కృషి కల్ప ఎంటర్ప్రెనర్ హైదరాబాద్, రీగల రవికాంత్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వాటిపై అవగాహనతో తమ కెరియర్లో ఎంతో ఉపయోగపడుతుందని ఎంబీఏ విద్యార్థులకు తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ఒక వ్యక్తి తన వ్యవస్థాపక ప్రేరణను బలోపేతం చేయడంలో అతని వ్యవస్థాపక పాత్రను సమర్థవంతంగా పోషించడానికి అవసరమైన నైపుణ్యాలు సామర్థ్యాలను పొందడంలో సహాయపడటానికి ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. బెనర్జీ, వైస్ ప్రిన్సిపాల్, అండ్ హెచ్ ఓడీ - సీఎస్ఈ, మిస్ రహేం సుల్తానా ఎంబీఏ హెచ్‌ఓడి ప్రోగ్రాం కోఆర్డినేటర్, బొడ్డు రఘు, పి ఆర్ ఓ, ఎంబీఏ డిపార్ట్మెంట్ స్టాఫ్ మెంబర్స్ - త్రివేణి, అరుణ్, రాజేష్ జాంగిర్, విద్యార్థులు పాల్గొన్నారు.



సీపీఎస్ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుల ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం సిద్దిపేట జిల్లా నుంచి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నీరడి లక్ష్మీనారాయణ, బోడ ప్రవీణ్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 నుంచి నియామకమైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూపీఎస్ విధానంలోకి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను చేర్చకుండా పాత పెన్షన్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరపున ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. లక్ష్మీ నారాయణ, ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం రద్దు అయ్యే వరకు ఉద్యమంలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. మా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులకి, ప్రధానకార్యదర్శి కల్వల్ శ్రీకాంత్‌కి, కోశాధికారి నరేష్‌కి జిల్లా అధ్యక్షులు దేవరాజ్, ప్రధానకార్యదర్శి శశియాదవ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు భరోసాపై మాట తప్పిన రేవంత్ సర్కార్

- తహసీల్దార్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నాయకులు నిరసన

నవతెలంగాణ-నంగునూరు

కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె నెక్కి 13 నెలలు గడిచినా, రైతు భరోసాపై మాట తప్పిన రేవంత్ సర్కార్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నంగునూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయకపోవడంపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ రాగుల సారయ్యలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా ద్వారా ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, నేడు రూ.12 వేలు మాత్రమే ఇస్తామని మాట తప్పడం పై రైతుల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి ఎంత చిత్తశుద్ధి ఉందో రాష్ట్ర రైతాంగం గమనిస్తుందని అన్నారు. అనంతరం తహసీల్దార్ జి.సరితకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు బిక్షపతి నాయక్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గోవిందారం రవి, తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధిని మరింత పెంచాలి

- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహా నిధిని మరింత పెంచాలని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ఒంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసీఆర్ సీఎం సహా నిధి కింద ఆస్పత్రి ఖర్చులను 70శాతం అందించే వారిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందులో 10శాతం కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించినట్లు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జకీర్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, మాజీ ఎంపీపీ పాండు గౌడు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అక్రమ కేసులు సహించం.. ఫార్ములా ఈ రేస్‌కు హైదరాబాద్ నగరాన్ని విశ్వదాభిప్తంగా వినిపించేలా చేసిన కేటీఆర్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులతో బెదిరింపులకు గురిచేయడం సిగ్గుచేటు అని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఇమేజ్‌ని డామేజ్ చేసే విధంగా కాంగ్రెస్ పాలన విధివిధానాలు ఉన్నాయన్నారు. ఏసీబీ విచారణకు తమ న్యాయవాదుతో వెళ్లిన కేటీఆర్‌ను పోలీసులు అడ్డుకోవడం రాజ్యాంగానికి కాలరాయడమేనని మండిపడ్డారు. కేటీఆర్‌పై ఈ ఫార్మా కేసు పెట్టి గొంతు నొక్కే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కేసులకు భయపడే ప్రసక్తి లేదని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, పాండు గౌడు, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో.. ప్రజ్ఞాపూర్ కాంగ్రెస్ నాయకులు కన్నా యాదవ్ తండ్రి కొనమైన మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప రెడ్డి ప్రజ్ఞాపూర్ వారి నివాసంలో కన్నా యాదవ్‌ను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి తండ్రి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని కోరారు. తండ్రి మృతి పట్ల చేస్తూ ఆయనకు మనం ధైర్యాన్ని నింపారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట 3వ వార్డు కౌన్సిలర్, లక్ష్మీ ఫౌండేషన్ చైర్మెన్ మార్కంటి వరలక్ష్మీ కనకయ్య ముదిరాజ్, ఎమ్.ఎస్ వెంకట్, సాయిబాబా, సాయి, ఏల వెంకటేష్, నర్సింలు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించిన డీఈఓ



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రతి ఒక్కరు దైనందిని (డైరీ) రాయడం అలవాటు చేసుకోవాలని, దైనందిని రాయడం మూలంగా గతంలో జరిగిన అంశాలన్నీ కూడా మననం చేసుకోవడం మూలంగా భవిష్యత్తుకు బాటలు పడుతాయని జిల్లా విద్యాశాఖధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) దైనందిని, కాలమాని- 2025 లను జిల్లా అధ్యక్షులు పట్నం భూపాల్, ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 ఏండ్లకు పైగా ఎస్ టి యు ఉపాధ్యాయ సంఘం చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మట్టపల్లి రంగారావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, రాష్ట్ర విద్యా పరిరక్షణ సిఫార్సుల కమిటీ కన్వీనర్ లింగ శ్రీనివాస్, సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షులు బెజగామ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలను పాటించాలి

- చేర్యాల సీఐ ఎల్.శ్రీను



నవతెలంగాణ-చేర్యాల

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని అంగడి బజారు చౌరస్తాలో సీఐ శ్రీను ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులతో ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గూర్చి పాటల ద్వారా వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ప్రమాదం చిన్నదైనా పెద్దదైనా దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. ఒక్క రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా, కృంగదీస్తుందన్నారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులు, వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,అతివేగం, రాంగ్ రూట్లో వాహనాలు నడపవద్దని తెలిపారు.

ప్రజల పక్షాన పత్రికలు నిలవాలి

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రజల పక్షాన పత్రికలు నిలిచి, వారి సమస్యలను వార్తల రూపంలో ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి సూచించారు. సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం నవతెలంగాణ-2025 కోర్టు కాలమాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, పీపీ రఫీయుద్దీన్, న్యాయవాదులు బాబురావు, అరవింద్, నవతెలంగాణ మెదక్ రీజియన్ మేనేజర్ రేవంత్ కుమార్, సిద్దిపేట డివిజన్ ఇంచార్జి యాదగిరి, రిపోర్టర్లు శ్రీనివాస్, బాలరాజు, మహేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఐటీ సాధనే లక్ష్యంగా చదవాలి

-హెచ్ఎం శ్రీనివాస్

-పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేత

నవతెలంగాణ-దుబ్బాక



పదో తరగతి విద్యార్థులు త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించడమే లక్ష్యంగా చదవాలని హెచ్ఎం నీలం శ్రీనివాస్ సూచించారు. పదిలో ఉత్తమ ఫలితాలు పొందేలా కష్టపడి చదువుకోవాలన్నారు. మంగళవారం అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని రామేశ్వరంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో బెల్లోజి రమేష్ చారి సహకారంతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభలు



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని ధర్మారం, గాగిల్లాపూర్, గ్రామాల్లో 2023- 24 ఏడాదిలో జరిగిన ఉపాధి హామీ చట్టం పనుల సామాజిక తనిఖీ గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఏడాదిలో జరిగిన పనుల వారిగా ఖర్చు చేసిన వివరాలను గ్రామ సభలో ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ, డీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ,తదితరులు ఉన్నారు.

టీచర్‌ను అభినందించిన హెచ్ఎం



నవతెలంగాణ-చేర్యాల

మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విశాఖపట్నంచే తెలంగాణ రాష్ట్ర స్థాయి 2024 గురుబ్రహ్మ అవార్డు అందుకున్న చేర్యాల మండలం నాగపురి గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంగ్లీష్ బోధిస్తున్న ఉపాధ్యాయులు అందె విజయ్ కుమార్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టె అయిలయ్య అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయిలయ్య మాట్లాడుతూ విద్యారంగం, సామాజిక సేవలో విజయ్ కుమార్ ముందుండడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నిరూపమ, పద్మ, మనోజ్ కుమార్,మాధవి, ప్రకాష్ రెడ్డి, యాదగిరి, స్వర్ణకుమార్, కనక లింగం, రాజేశ్వరి, ఫహీమ సుల్తానా,శ్రీధర్,ఉమర్, స్వామి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన కొమ్మాట లక్ష్మి (60) కుటుంబానికి జగదేవ్‌పూర్ మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మండల రజక సంఘం నాయకులు బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు వడ్లకొండ శ్రీనివాస్, రాచకొండ యాదగిరి, అక్కరాజు రాజయ్య, వడ్లకొండ దుర్గయ్య, బసవరాజ్ గణేష్, మరిగడ్డ తిరుపతి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ఇమ్మానియేల్ గాస్పల్ మందిరంలో మంగళవారం మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ స్టేట్ కోఆర్డినేటర్ జంగిటి కృపావరం ఆధ్వర్యంలో వంద మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కోతిదాస్, కోతిపాల్, గడిపె పీటర్, ఖాత చంద్రయ్య, కోడూరి చంద్రయ్య, కోతి బాబు, కోతి మోష, ఎర్రోళ్ల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

రేబర్తిలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-మద్దూరు

రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని రేబర్తి పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు మంగళవారం ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

మెడికల్ అసోసియేషన్ క్యాలండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్‌ను మంగళవారం డీఎంహెచ్ఓ పల్వాన్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. గజ్వేల్ డివిజన్ 3194, ఐఎన్టీయూసీ 7852 యూనియన్ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఆనంద్, నవీన్, రాజ్ కుమార్, ఆదిమూల నారాయణ, వాసుదేవ్, స్వరూప, సుజాత, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

19న జీపు జాత, 24న అమరవీరుల జ్యోతి యాత్ర

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట పట్టణంలో ఈ నెల 19వ తేదీన ప్రారంభమై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగనున్న జీపుజాతను, అమరవీరుల జ్యోతి యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలో జనవరి 25 నుంచి 28 వరకు జరిగే సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన సిద్దిపేట పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి జీపుజాతను, అమరవీరుల జ్యోతి యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ జీపుయాత్ర ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలను గ్రామాలలో ప్రచారం చేస్తూ 25వ తేదీన సంగారెడ్డి పట్టణంలో జరిగే భారీ బహిరంగ జరిగే నాటికి సంగారెడ్డికి చేరుకుంటుందని తెలిపారు.

24న బైరాన్ పల్లి నుంచి అమరవీరుల జ్యోతి యాత్ర

నీతి నిజాయితీ విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ ప్రత్యామ్నాయ రాజకీయాలను ప్రజల ముందు ఉంచడానికి సీపీఐ(ఎం) మహాసభలు వేదిక కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రమైన బైరాన్‌పల్లి బురుజు నుంచి అమరవీరుల జ్యోతి యాత్రను ప్రారంభిస్తున్నామని తెలిపారు జనవరి 24వ తేదీన బైరాన్ పల్లి బురుజు నుంచి అమరవీరుల జ్యోతి యాత్ర ప్రారంభమై 25వ తేదీన సంగారెడ్డిలో జరిగే బహిరంగ సభకు చేరుకుని, బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ బృందాకరత్‌కు అందించడం జరుగుతుందని చుక్క రాములు తెలిపారు.

ఉద్యమాల రూపకల్పనకు మహాసభలు

రాష్ట్రంలో సీపీఐ(ఎం) ప్రజల పక్షాన అనేక పోరాటాలను నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తుందని అనేక విజయాలు పోరాటాల ద్వారా సాధించిందని, ఆ పోరాటాలను సమీక్షించమని ప్రజలను సమస్యల నుంచి విముక్తి చేయడానికి ఉద్యమాలు రూపొందించడానికి రాష్ట్ర నాలుగవ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కార్పొరేట్ అనుకూల విధానాలపై రానున్న కాలంలో ప్రజల్ని సమీకరించి ప్రజాస్వామ్య, లౌకిక తత్వ, రాజ్యాంగ పరిరక్షణ కోసం, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించడానికి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయాలను ప్రజల ముందు ఉంచడానికి సీపీఐ(ఎం) మహాసభలు వేదిక కానున్నాయన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సంద బోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డు బర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగర్ వెంకట్ మావో, బద్దిపడి కృష్ణారెడ్డి, చొప్పరి రవికుమార్, అమ్ముల బాల నరసయ్య, బండ కింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, సింగిరెడ్డి నవీన, జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్‌లు పాల్గొన్నారు



అభివృద్ధిలో మున్సిపల్ మొదటి స్థానంలో ఉండాలి

- అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

నవతెలంగాణ-సిద్దిపేట



అభివృద్ధిలో సిద్దిపేట పురపాలక సంఘం జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఉండేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. మంగళవారం పురపాలక సంఘం కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తో కలిసి పురపాలక సంఘం కార్యాలయంలో రెవెన్యూ, ట్రేడ్ లైసెన్స్ సిబ్బందితో అడిషనల్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్ వివరాలను పరిశీలించి, ఇంటి పన్ను వసూలు, ప్రతిరోజు ఎంత వసూలు చేస్తున్నారు, ఎందుకు ఇంకా మిగతా డిమాండ్ మిగిలి ఉందని అడిషనల్ కలెక్టర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. సిద్దిపేట పురపాలక సంఘం ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మార్చి 31 వరకు ఇంటి పన్ను వసూళ్లకు సమయం ఉన్నందున మనకు ఉన్న ఈ తక్కువ సమయంలోనే త్వరితగతిన పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు బిల్ కలెక్టర్ వారిగా చేసినటువంటి పన్ను వసూలు వివరాలను అందజేయాలన్నారు. ఇంకా మిగిలినటువంటి పన్ను వసూలును మార్చి 31 వరకు మిగిలి ఉన్న రోజులకు విభజించుకొని ప్రతిరోజు టార్గెట్ ను పూర్తిచేయాలని ఆదేశించారు. పట్టణంలో వాణిజ్య, వ్యాపారస్తుల వద్ద నుంచి ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పాత బకాయిలు, ప్రస్తుత బకాయిలు తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. సిద్దిపేట పుర ప్రజలు, వాణిజ్య, వ్యాపారస్తులు సైతం అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీఈ ప్రేరణ, పృథ్వి, ఆర్వో శ్రీకాంత్, ఆర్ఐ బాలకృష్ణ, భారతి, అజ్మత్ అలీ, బిల్ కలెక్టర్ లు, ట్రేడ్ లైసెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా సీఎం క్రికెట్ కప్ పోటీలు

నవతెలంగాణ-సిద్దిపేట



సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ప్రారంభమైన క్రికెట్ పోటీలు రసంతరంగా జరుగుతున్నాయి. మంగళవారం మొదటి మ్యాచ్ శివాజీ యూత్, రైస్ మిల్ టీం చిన్న గుండవెల్లి జరగగా రైస్ మిల్ టీం చిన్న గుండవెల్లి 6 వికెట్ల తేడాతో గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కనకరాజు నిలిచాడు. రెండవ మ్యాచ్ శ్రీ రాజా వారియర్స్, అంబేద్కర్ యూత్ మధ్య జరగగా శ్రీ రాజా వారియర్స్ 7 రన్స్ తేడాతో గెలిచింది. ఇందులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పరశురాములు నిలిచాడు. మూడో మ్యాచ్ వికెపి వారియర్స్, బుస్సాపూర్ యంగ్ స్టార్స్ మధ్య జరగగా, బుస్సాపూర్ యంగ్ స్టార్స్ గెలుపొందారు, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తిరు నిలిచాడు. నాలుగో మ్యాచ్ బోర్వెల్ రైడర్స్, వరాల సురేష్ కింగ్ సిటీ మధ్య జరగగా, వరాల సురేష్ కింగ్ సిటీ 7 వికెట్ల తేడాతో గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అర్జున్ నిలిచాడు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చెంది రెడ్డి నరేందర్ రెడ్డి, విజయ్, శివ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అవార్డు

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా ఉత్తమ పాఠశాలగా హై బీజ్ టీవీ సంస్థ ఎంపిక చేయడంతో, మంగళవారం హైదరాబాదులోని హైటెక్స్ నోవాటెల్ హోటల్లో శాంతాబయోటిక్స్ చైర్మెన్ శ్యాంప్రసాద్ రెడ్డి, మల్లారెడ్డి కళాశాల వైస్ చైర్మెన్ ప్రీతి రెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్య గౌడ్‌లు అవార్డును పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ ప్రభాకర్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తమ ప్రభుత్వ పాఠశాల ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ, రాబోయే రోజుల్లో మరింత ఉన్నతంగా ఇందిరానగర్ పాఠశాలను నిలబెట్టుతామని తెలిపారు. ఈ అవార్డు ఉపాధ్యాయులకులకు అంకితమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కోసం మంత్రుల బృందాన్ని కలుస్తాం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం కోసం ఈనెల 20 తర్వాత మంత్రుల బృందాన్ని కలసి ఈ ప్రాంత ఆకాంక్షా, ఆవశ్యకతను తెలియజేస్తామని జేఏసీ చైర్మెన్ ఆర్. పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జేఏసీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పరమేశ్వర్ మాట్లాడుతూ గత నెలలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన సందర్భంలో డివిజన్ ఏర్పాటుకు కలెక్టర్ అనుకూలమైన వైఖరి చెప్పడం వల్ల ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. మంత్రుల బృందంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిలను కలువనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషనర్ బక్కి వెంకటయ్యను కలిసిన నాయకులు

నవతెలంగాణ-కౌడిపల్లి

మాల మహానాడు అధ్యక్షులు కల్లూరి సంజీవ, మాల మహా నాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉరట్ల శివలు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాదులోని ఎస్సీ ఎస్టీ కమిషనన్ కార్యాలయంలో పూలమాల శాలువాతో బక్కి వెంకటయ్యను సన్మానించారు. జిల్లాలో జరుగుతున్న ఎస్సీ ఎస్టీ లపై ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్సీ ఎస్టీ కమిషనర్ బక్కి వెంకటయ్యకు వివరించారు ఇందులో భాగంగా నర్సాపూర్ మాల మహానాడు మండల అధ్యక్షులు గోవు యాదగిరి కౌడిపల్లి మండల అధ్యక్షులు నీరుడి కుమార్, బేకరీ కృష్ణ ఈశ్వరయ్య బాలగోపాల్ మైనార్టీ సెల్ అధ్యక్షులు కుద్బొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ముక్కోటి ఏకాదశి కరపత్రాలు, గోడ పత్రికలు ఆవిష్కరణ

- ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



భద్రాచల దేవస్థానం ప్రతిఏటా ముక్కోటి ఏకాదశిని అంగరంగ వైభవంగా నిర్వహిస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి ముక్కోటి ఏకాదశికి సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలు, శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 26ఏండ్ల నుంచి నిర్విరామంగా లక్షల మంది భక్తులచే రామకోటి లిఖింపజేస్తున్నరన్నారు. ఆధ్యాత్మిక సేవను గుర్తించి నేడు భద్రాచల దేవస్థానం ముక్కోటి ఏకాదశి కరపత్రాలను, గోడ పత్రికలను ప్రతి ఏడాది పంపించడం రామకోటి రామరాజు భక్తికి నిదర్శనం అన్నారు. రాముని సేవకే అంకితమైన గొప్ప రామభక్తుడు అని కొనియాడారు. మూడు కోట్ల ఏకాదశులతో సమానమే ఈ ముక్కోటి ఏకాదశి అన్నారు. ఉత్తర ద్వారా దర్శనం వల్ల కోటిపుణ్యాల ఫలితం కలుగుతుందన్నారు. రామకోటి రామరాజును మరో భక్త రామదాసుగా భద్రాచల దేవస్థానం గుర్తించడం ఆయన భక్తికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు, కృష్ణాలయం అధ్యక్షులు యెలగందుల రామచంద్ర, దూబకుంట మైత్రాములు, రాచకొండ శ్రీనివాస్, కుమ్మరి మల్లేశం, బయ్యారం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కేజీబీవీ హాస్టల్ విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి
- వివిధ గ్రామాలను సందర్శన
- జిల్లా పంచాయతీ అధికారి దేవిక దేవి

నవతెలంగాణ-రాయపోల్



గ్రామాలలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కారం చేయాలని పారిశుద్ధ్యం మంచినీరు పాఠశాల హాస్టల్లో విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవికా దేవి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలంలో ఆమె రాయపోల్ మండల కేంద్రం తోపాటు లింగారెడ్డిపల్లి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య సమస్యలు ఉంటే సహించేదిలేదన్నారు. లింగారెడ్డిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. రాయపోల్ గ్రామ పంచాయతీలో కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడారు. హాస్టల్ లో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులంతా హాస్టల్‌లో సౌకర్యాలు బాగున్నాయని భోజనం బాగుందని తెలిపారు. హాస్టల్ గదులు మాత్రం ఇరుకుగా ఉన్నాయని చదువుకోడానికి, పడుకోవడానికి ఒకే గదులు ఉండడం ఇబ్బందిగా ఉందని తెలిపారు. అనంతరం ఆమె రాయపోలు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో జరుగుతున్న పనుల గురించి సమీక్ష నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల పట్ల ఏ విధమైన నిర్లక్ష్యం వహించకూడదని తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పాఠశాలలు, హాస్టల్లోని విద్యార్థులకు మంచినీటి సరఫరాలో ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోతరాజు బాలయ్య , ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో మాసాయిపేట విద్యార్థిని

-నీటిపారుదల రోబో ప్రదర్శన

నవతెలంగాణ-వెల్దుర్తి



మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలోని ఎస్. వి. కె. ఎం. స్కూల్లో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగుతున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లో మాసాయిపేట జెడ్పీహెచ్ ఎస్ విద్యార్థిని దుంపలసిరి బంగారు. టీచర్ అంజనేయులు సహకారంతో స్వయం చాలక నీటిపారుదల రోబో విధానంతో అందరిని ఆకట్టుకున్నది. రోబోతో ఇంటి వద్ద ఉండి పంట పొలాలకు సాగునీరు అందించే నమూనాను ప్రదర్శించారని ప్రధానోపాధ్యాయుడు ధర్మపురి తెలిపారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయ బృందం సైన్సు ఉపాధ్యాయులు రంగారెడ్డి రాష్ట్రస్థాయిలో మంచి ప్రదర్శన కనబరిచి జాతస్థాయికి ఎన్నిక కావాలని వారు ఆకాంక్షించారు.

ప్రజా సంక్షేమ పాలనలో కాంగ్రెస్ పూర్తిగా విఫలం

- బీజేపీ రాష్ట్ర నాయకులు గురువారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ అని, ప్రజా సంక్షేమ పాలనలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, బీజేపీ సీనియర్ నాయకుడు దారం గురువారెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ లో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణ, బీజేపీ నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులకు రైతుబంధు రూ.15వేలు ఇస్తామని, మోసం చేస్తుందని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ధరణి లో సమూల మార్పులు చేసి అసైన్ ల్యాండ్, లావని భూమి పట్టా చేసి రైతులకు ఇస్తా అని హామీ ఇచ్చిందని ఆ హామీని తుంగలో తొక్కిందని అన్నారు. దేవాలయాల భూములు పరిరక్షించాలని లేనిచో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, మహేందర్, బారు అరవింద్, సందీప్, రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీకి ఆదర్శ కళాశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-దౌల్తాబాద్



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 హాకీ రాష్ట్ర స్థాయి పోటీలకు దౌల్తాబాద్ ఆదర్శ కళాశాల విద్యార్థి కే. అనిల్ కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 8వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. కళాశాల విద్యార్థి ఎంపిక కావడానికి కృషి చేసిన పాఠశాల పీడీ సురేష్, ఎంపికైన విద్యార్థిని అనిల్ కుమార్ ను ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.